కథాసుధ

# అలల గారడీ

**ఒక** పండితుడు సముద్ర తీరాన కూర్చుని సూర్యోదయాన్ని ఆస్వాదిస్తూ, అలల్ని చూస్తున్నాడు. అక్కడికి సమీపంలో ఓ విద్యావంతుడైన యువకుడు నిరాశగా కూర్చున్నాడు. అతణ్ని నిరాశకు కారణం ఏంటని అడిగాడు పండితుడు. అప్పుడు ఆ యువకుడు 'నేను చేస్తున్నది చిన్న ఉద్యోగం, తక్కువ జీతానికి పని చేస్తున్నానని నా మిత్రులు వెక్కిరిస్తున్నారు' అని వాపోయాడు. పండితుడు చిన్నగా నవ్వి పక్కనే ఉన్న మొక్క నుంచి కొన్ని పూలు కోయమని యువకుడికి చెప్పాడు. వాటిని సముద్రంలోకి విసిరేయమన్నాడు. ఆయన చెప్పినట్లే చేశాడు యువకుడు. అలల ఉద్ధృతికి పూలు వెనక్కి వచ్చాయి. సమీపంలోని ఓ పెద్ద చెట్టు ఆకులను కోసి సముద్రంలోకి విసిరేయమని మళ్లీ చెప్పాడు. అలాగే చేశాడు యువకుడు. అవికూడా కొద్దిసేపటికి

వెనక్కి వచ్చేశాయి. 'గమనించావా సముద్రంలోకి నువ్వు పూలు విసిరినా, ఆకులు విసిరినా రెండూ వెనక్కి వచ్చేశాయి. పూలు గొప్పవనీ, ఆకులు చెడ్డవని సముద్రం పట్టించుకోదు. అలలతో కూడిన సముద్రం తన ఉనికిని కోల్పోకుండా అలాగే ఉంటుంది. నువ్వుకూడా ఇతరుల అభిప్రాయాలకు వెరవకు. గత అనుభవాల ఆధారంగా, నీ భవిష్యత్తును ఊహించి సలహాలు ఇస్తుంటారు. వాటిని నువ్వు పట్టించుకోవాల్సిన పనిలేదు. ధర్మ సమ్మతంగా కష్టపడటమే మనం చేయాల్సింది. కష్టే ఫలి అన్నారు కదా!' అని సలహా ఇచ్చాడు పండితుడు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాన్ని కొనసాగిస్తూ... కష్టపడితే పెద్ద ఉద్యోగం సంపాదించవచ్చని యువకుడికి నమ్మకం కలిగింది. పండితుడికి ధన్యవాదాలు తెలిపి అక్కణ్నుంచి ఉత్సాహంగా ముందుకు కదిలాడు.

...✍ ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
93936 62821

ఇస్లాం బోధ

# చేసిన ధర్మం చెప్పొద్దు

అల్లాహ్ సంతోషం కోసం, చిత్తశుద్ధితో వ్యయం చేసే వారి ధనాన్ని మెట్ట ప్రదేశంలోని తోటతో పోల్చుతుంది ఖురాన్. సమృద్ధిగా వర్షం కురిస్తే ఆ తోట రెట్టింపు పంటను ఇస్తుంది. సన్నని జల్లులు పడ్డా తగిన ఫలం దక్కుతుంది. నిజాయతీతో సంపాదించిన ధనాన్ని కుటుంబ అవసరాలకు పోగా, మిగిలినది దైవ మార్గంలో ఖర్చు చేయాలని ఖురాన్ సూచిస్తుంది. నిరుపేదలు, బంధువులు, అన్నార్తులను ఆదుకోవడాన్ని అల్లాహ్ మార్గంలో చేసే ఖర్చుగా అభివర్ణిస్తారు ముహమ్మద్ ప్రవక్త (స). ఆయన మార్గంలో ఖర్చు చేసే ఒక్క రూపాయి ఏడువందల రెట్ల పుణ్యాన్ని ఇస్తుంది. అయితే, దానం చేసే సొమ్ము సక్రమ మార్గంలో సంపాదించిందై ఉండాలని ఖురాన్ ఉద్బోధ. దానం చేసి చులకనగా చూడటం, కృతజ్ఞత ఆశించడం, ప్రచారం చేసుకోవడం వల్ల ఆ ఫలితం వృథా అవుతుంది.

''ఒక రాతి కొండపై మట్టి పొర ఉంది. భారీ వర్షం పడితే.. దానిపై ఉన్న మట్టంతా కొట్టుకుపోయి రాయి మాత్రమే మిగిలిపోతుంది. అలాగే ఇతరుల మెప్పు కోసం దానం చేస్తున్నా మని భావించే వారి పుణ్యకార్యం వల్ల కూడా ఏ ప్రయోజనం కలుగదు.'' (దివ్య ఖురాన్ 2-265)

### జకాత్.. ఫిత్రా.. సదఖా..

ముస్లింలు దానధర్మాలను జకాత్, సదఖా, ఫిత్రా పద్ధుల్లో ఖర్చు పెడతారు. ఏడాదిపాటు తమ దగ్గర ఉన్న సంపదలోంచి రెండున్నర శాతం తీసి అభాగ్యులు, అనాథలకు అందించడాన్ని జకాత్ అంటారు. జకాత్ అంటే శుద్ధి చేయడం. జకాత్ ఇవ్వడం అంటే సంపదను శుద్ధి చేసుకోవడం అన్నమాట. గుర్తుంచుకోవలసిన వాస్తవం ఏమిటంటే, కేవలం ధర్మసమ్మతమైన పద్ధతుల్లో సంపాదించిన సంపద మాత్రమే జకాత్ వల్ల శుద్ధమవుతుంది. అధర్మంగా సంపాదించింది దానం చేసినంత మాత్రాన ఏ ఫలితమూ రాదు. అలాంటివారికి దైవ సన్నిధిలో శిక్ష తప్పదు అంటుంది ఖురాన్.

**రంజాన్** పండుగకు ముందు చేసేది ఫిత్రా. ఇది ప్రతీ ముస్లిం విధిగా చేయాలి. స్థితిమంతులైన ముస్లింలు ఈ పవిత్ర మాసంలో కిలోన్నర గోధుమలకు సరిపడా డబ్బును పంపిణీ చేస్తేనే.. వారి ఉపవాసాలను దైవం స్వీకరిస్తాడని ప్రవక్త ప్రవచించారు. సంపదలో కొంతమొత్తాన్ని నిరుపేదలకు పంచాలన్నది సదఖా ఉద్దేశం. కష్టార్జితంతో సంపాదించిన చిన్న ఖర్జూరపు ముక్కనైనా సదఖా (దానం) చేయండి అని ప్రవక్త (స) చెప్పారు. అలా చేసిన ఖర్జూరపు ముక్కను అల్లాహ్ స్వయంగా తన కుడిచేతిలో తీసుకుని దాన్ని పెంచి పోషిస్తాడు. అల్లాహ్ మన దాన పరిమాణాన్ని చూడడు, మన ఆంతర్యాలను, సంకల్పాన్ని మాత్రమే చూస్తాడు. సత్సంకల్పంతో చేసే గోరంత దానం కూడా కొండంత ఫలితాన్ని ఇస్తుంది. ఇతరుల మెప్పు కోసం చేసే కొండంత దానం కూడా రవ్వంత ప్రయోజనాన్ని చేకూర్చదు అని గుర్తెరగాలి!

...✍ ముహమ్మద్ ముజాహిద్
96406 22076

# దానం అంటే..

**కుడి** చేతితో చేసిన దానం ఎడమ చేతికి తెలియకూడదు అంటారు పెద్దలు. చాలామంది గొప్పల కోసం దానాలు చేస్తుంటారు. అయితే, చేసిన దానం చెప్పుకొంటే దాని ఫలితం పోతుందని పెద్దల మాట. ఇందుకు ఉదాహరణగా నిలుస్తుంది యయాతి కథ. యయాతి తపోనిష్ఠ, దానధర్మాలు ఆయనకు ఇంద్ర పదవిని కట్టబెట్టాయి. ఆయనను ఇంద్రసభకు తీసుకువెళ్లడానికి సప్తర్షులు వచ్చారు. పల్లకీలో కూర్చున్నాడు యయాతి. సప్తర్షులు పల్లకిని మోస్తూ కదిలారు. యయాతిలో అహంకారం మొదలైంది. విచక్షణ కోల్పోయాడు. అప్పటివరకు తను చేసిన దానాల గురించి, యజ్ఞాల గురించి గొప్పగా చెప్పడం ప్రారంభించాడు. దాంతో స్వర్గానికి చేరుకోవడానికి ముందే యయాతి పల్లకి నుంచి కింద పడిపోయాడు. అతనికి ఇంద్ర పదవి అందని ద్రాక్షే అయింది. -శ్రీ

# కలయో..



> తాను కాని జడములైన దేహాదులను తాను అనీ, తనవి అనీ భ్రాంతి పడటమే మోహం- అజ్ఞానం. ఆ భ్రమ తొలగటమే భ్రమ- యథార్థ జ్ఞానం. 'జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః' (గీత)- ఆ అజ్ఞానం పరమాత్మ జ్ఞానం కలిగితేనే నశిస్తుంది. అజ్ఞానం అంతరించడానికి జ్ఞానోదయం ఎలా అనివార్యమో, దేహాభిమాన నివృత్తికి, దైత్య వినాశనానికి భగవదవతారం అంత అవశ్యకం. అవతారం భగవంతునికి లీల- వినోదం. భక్తులకు తత్త్వజ్ఞాన ప్రదం- ప్రమోదం. ప్రాపంచికంగా లోకంలో ఏ విషయం విష సమానమో- దోషమో, పాపమో, దూషణమో, పరమాత్మ పరమైతే అదే అమృత తుల్యం- గుణము, పుణ్యము, భూషణమవుతుంది. తృష్ణ, కామ, లోభాది అశుభ వాసనలు కూడా కృష్ణ సంబంధితాలైతే ఆత్మీయ ఆభరణాలవుతాయి. మాధవాశ్రితము, అర్పితమూ అయిన ఏ విషయమైనా మహిమాన్వితమవుతుంది. కృష్ణచంద్రుని చౌర్య జారత్వాలు కూడా ఆశ్రయ మహత్త్వం వలన చాటుమాటు పాపాలు పోగొట్టేవి, కోటికోటి పుణ్యాలు మూటకట్టేవిగా పరిణమిస్తాయి.

# వైష్ణవ మాయయో!..

**శుక మహర్షి** పరీక్షిత్తుతో.. రాజా! ఒకనాటి ప్రొద్దున వెన్నుడు- బాలకృష్ణుడు మన్ను తిన్నాడని రామన్న, ఇతర గొల్లపిల్లలు కన్నయ్యను తీసుకువచ్చి తల్లి యశోదతో వెల్లడించారు. ఆమె పాపని చేయి పట్టుకొని కోపం నటిస్తూ ఇలా అన్నది...

**కం॥ 'మన్నేటికి భక్షించెదు**
**మన్నియమములేల నీవు మన్నింపవు? మీ**
**యన్నయు సఖులును జెప్పద**
**రన్నా! మన్నేల మరి పదార్థము లేదే?'**

'కన్నా! మన్నెందుకు తిన్నావురా? నేను అన్న (చెప్పిన) నియమాలను ఎందుకు మన్నించవు (పాటించవు)? బిడ్డా! తల అలా అడ్డంగా ఊపుతావేల? నీ అన్న రామన్న, నీ వెంట ఉన్న పిల్లలు అందరూ చెబుతున్నారు. అయినా, మట్టి తినవలసిన కర్మ నీకేమి పట్టిందిరా? ముద్దుల పట్టీ! (కొడుకా) తినడానికి ఇంట్లో వేరే గట్టి పదార్థాలే లేవా?' అంటూ చిన్నారి చిట్టి-చిట్టి చేతులను తన చేతిలోనికి తీసుకొని, రెండో చేతిలో బెత్తం పట్టుకొని ఝళిపిస్తూ మట్టి ఎందుకు తిన్నావో చెప్పమని రెట్టించి గట్టిగా గద్దించింది. 'భయానాం భయం భీషణం భీషణానాం..' భయానికే భయంకరుడు, భీషణులకు కూడా విభీషణుడు, ఆశ్రితులకు అభయంకరుడు అయిన భగవంతుడు భయపడిపోయాడు. 'ఇప్పుడు అబద్ధం చెప్పకపోతే ఒంటిమీద వెంటనే దెబ్బపడక తప్పదు. కనుక, ఈ అపాయం తప్పించుకోవటానికి ఒక కల్ల (అసత్యం) ఆడతా' అని నిశ్చయించి తల్లితో ఇలా పలికాడు..

**శా॥ 'అమ్మా! మన్ను దినంగ నే శిశువునో? యాకొంటినో? వెర్రినో?**
**నమ్మం జూడకు వీరి మాటలు మదిన్ నన్నీవు గొట్టంగ వీ**
**రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు, కాదేనినీ మదీయాస్య గం**
**ధమ్మ ఘ్రాణము సేసి నా వచనముల్ దప్పైన దండింపవే'**

అమ్మా! మన్ను తినడానికి నేనేమైనా చన్ను కుడిచే చిన్నవాడనా? (నాలుగు మోములున్న బ్రహ్మదేవుని కన్నతండ్రిని. మున్నెన్నడో రెండడుగులలోనే మన్ను, మిన్నులను ఒక్కుమ్మడిగా కమ్ముకొన్న వాణ్ని. 'తెలియక తిన్నానేమో!' అనుకుందామన్నా సర్వజ్ఞుడనైన నాకు- తెలివే (జ్ఞానమే) స్వరూపంగా ఉన్న నాకు తెలివి తప్పడమన్నది ఉంటుందా?) ఆకలి వేసిందేమో అనుకోవడానికి ఇందాకేగా పీకలదాకా పాలు తాగి వెళ్లాను. (ప్రాణమున్న జీవులకే క్షుత్తు పిపాసలు- ఆకలి దప్పులు. 'నాహం ప్రాణః'- 'నేను ప్రాణం కాదు. ప్రాణుల ప్రాణాలకు ప్రాణాన్ని- చైతన్యాన్ని. నాకు ఆకలి దప్పులు లేవు) లేకపోతే నేనేమైనా

భగవంతుడు అమ్మకు నమ్మకం కలిగించడానికి, తన నిర్ద్వైషిత్వం నిరూపించుకోవడానికి తన నోరు వాసన చూసుకోమన్నాడు. వ్యవహారం అసలు అంతవరకు రాకనే సమసిపోతుందని భావించి వెసులుబాటు (స్వేచ్ఛ)గా అలా అన్నాడు ముసలి (బలరామ) అనుజుడు, మాయా మనుజ బాలకుడు, దనుజ మర్దనుడు జనార్దనుడు. కాని, నంద గృహిణి గంభీర స్వభావం కల వ్యక్తి, 'అలాగైతే నోరు తెరచి చూపరా' అన్నది ఆమె. చిక్కులో పడ్డ చక్రధరునికి నోరు తెరవక తప్పింది కాదు. దామోదరుడు ఆమోదించి తల్లికి మోదంతో తన నోరు తెరచి చూపాడు. ఆశ్చర్యం!

**కం॥ 'ఆ లలితాంగి గనుంగొనె**
**బాలుని ముఖమందు జలధి పర్వత వన భూ**
**గోళ శిఖి తరణి శశి ది**
**క్పాలాది కరండమైన బ్రహ్మాండంబున్'**

'ఆ పసివాని నోటిలో యశోద పర్వతాలు, పయోనిధులు- సముద్రాలు, అరణ్యాలతో కూడిన భూగోళం, అగ్ని, సూర్యచంద్రులు, అష్ట దిక్పాలకులతో అలరే బ్రహ్మాండాన్నంతా చూచింది.' ఆ భామిని భ్రాంతికిలోనై భయపడి మూర్ఛపోయింది. ఆమె చేతిలోని దండం జారి పడిపోయింది. స్పృహలోకి వచ్చి ఇలా అనుకున్నది..

**మ॥ 'కలయో! వైష్ణవ మాయయో! ఇతర సంకల్పార్థమో! సత్యమో!**
**తలపన్ నేరక యున్న దాననో! యశోదా దేవి(గానో! పర**
**స్థలమో! బాలకుడెంత యీతని ముఖస్థంబై యాజాండంబు ప్ర**
**జ్వలమై యుండట కేమి హేతువొ! మహాశ్చర్యంబు చింతింపగన్'**

'నేను కలగంటున్నానా? లేక ఇది జలజాతాక్షుని (విష్ణుని) అలవి (సాధ్యం) కాని మాయాజాలమా? ఇదికాక మరేదైనా అర్థముందా? లేక ఇది సత్యమేనా? నా మతి (బుద్ధి)కి అవగతి (తెలివి) తప్పిపోయిందా? ఇంతకూ నేను యశోదనేనా? ఇది స్వగృహమా లేక పరగృహమా? కాక పోతే ఈ పిల్లవాడెంత? వీని నోటిలో బ్రహ్మాండ మెల్ల (అంతా) ఇలా వెలుగులు చిమ్మడం ఎంత వింత? చింతించే కొద్దీ ఇదంతా ఎంతో ఆశ్చర్యంగా ఉంది. పసివానిగా కనిపిస్తున్నా వీడు అసురారి- రాక్షస విరోధి. సర్వాత్మకుడైన 'నందక' అసి (ఖడ్గ) ధారి! విష్ణువే! ఇందులో ఎట్టి సందేహమూ లేదు. ఇది ముమ్మాటికీ నిజం!' ఇలా నిశ్చయించుకొని యశోద తన తనయుని ముందు మోకరిల్లి, తలవంచి నమోవాకాలర్పించి. తన ఆర్తులను (దుఃఖాలను) తొలగించమని కీర్తించి అర్థించింది. 'ఈ బాలుని ముఖం చూచి నేను, నా భర్త, గోప గోపీజనం, చివరకు ఆవులు కూడా 'ఇతడు కాల కాలుడు, భక్తలోక పాలకుడు, మా అందరికి ప్రభువు' అని గుర్తించక, బాలుడే అని భ్రాంతిపడి ప్రవర్తించాం కదా! ఎంత అపచారం! మా అపరాధం క్షంతవ్యమగుగాక!'



తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

శుకుడు- రాజా! ఇలా తనను గోప బాలకునిగా కాక విశ్వపాలకునిగా భావిస్తున్న నంద భామిని యందు మరల వైష్ణవ మాయను ఆవహింపజేశాడు హలి సోదరుడు వనమాలి! యశోద విచారణ ద్వారా మాయను అధిగమించగలిగితే నా స్వరూప జ్ఞానం పొందుతుంది. అట్టి తరి బాల్య లీల ప్రదర్శన కుదరదని కృష్ణుడు తల్లికి మాతృపుత్ర (తల్లీబిడ్డల) బుద్ధిని కలిగించాడు. తాను తనయుని గాను, ఆమె తల్లి గాను తలపించి, వాత్సల్యరసంలో ముంచివేశాడని పరమార్థం! రాజా! ఆ మాయా ప్రభావం వలన నంద జాయ (పత్ని) యశోద మోహం చెంది తన కన్న- ముద్దుబిడ్డ 'సర్వాత్ముడు' అన్న నిజం మరిచిపోయింది. కన్నయ్య తన కొడుకే అని భావించి అతనిని వడివడిగా ఒడిలో చేర్చుకొని కడు వేడుకతో ముద్దులాడింది.

శుకముని ఇలా చెప్పగా విని అవనీపతి అతి కుతూహలంతో ఇలాగని ప్రశ్నించాడు.. చతుర్దశ భువనాలకీ ప్రభువైన భగవంతునికి పాలిచ్చి పెంచే జననిగా జన్మించడానికి నందగృహిణి తొలి బాము (జన్మ)లలో ఏ నోములు నోచిందో? పురుషోత్తముని పోషించే పితరునిగా పుట్టడానికి ఓ నందితాత్మా!- (మాధవ కథామృతం ఆస్వాదిస్తూ ఆనందించే మహాత్ముడవు నీవు) నందగోపుడు ఎట్టి తపస్సు చేశాడో!

**కం॥ 'ప్రబ్బిన భక్తిని హరిపై(**
**గబ్బంబులు సెప్పి కవులు కైవల్య శ్రీ**
**కబ్బుదురట! హరిపోషణ**
**మబ్బిన తలిదండ్రులెచటి కబ్బుదురొ తుదిన్'**

యోగీంద్రా! కవీంద్రులు ఎంతో భక్తితో అతీంద్రియుడు, ఉపేంద్రుడు శ్రీహరిపై కావ్యాలు రచించి మోక్ష లక్ష్మీ కటాక్షానికి పాత్రులు అవుతారట! మరి కేశవుని కనిపెంచి పోషించే భాగ్యానికి నోచుకున్న జననీజనకులు ఏ లోకంలో పాగా వేస్తారో కదా!

**పిండితార్థం... తాను కాని మన్నులేదు, తినడమనే క్రియ లేదు. కాన, కన్నయ్య మన్ను తినలేదన్నా నిజమని తేలింది! 'మాకు ఈ అర్థాలు పరమార్థాలు ఎందుకండీ? నందనందనుడే చాలు' అన్నారు గోకులవాసులు!**

(సశేషం)

# ఆనంద నిలయం..
# ఆదిశక్తి ఆలయం

**భారతదేశంలో** అష్టాదశ శక్తి పీఠాల అమ్మవార్లు ఒకే దగ్గర కొలువైన క్షేత్రం ఆనందాశ్రమం. సిద్దిపేట జిల్లా కొండపాక సమీపంలో ఉన్న ఈ ఆనంద నిలయంలో ఎందరో వృద్ధులు విశేష జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. అలాంటి ప్రాంగణం ఇప్పుడు ఆధ్యాత్మిక క్షేత్రమై అలరారుతున్నది. దేశంలోని వివిధ రాష్ట్రాలలో భక్తుల కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్న అమ్మవార్లు ఇక్కడ కొలువుదీరారు. హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారిలో కొండపాకలో ఉన్న ఈ సువిశాలమైన ప్రాంగణం ఇప్పుడు ఓ ఆధ్యాత్మిక కేంద్రం.

**శక్తిపీఠాలు** పద్దెనిమిది. వీటిలో పదిహేడు మనదేశంలో ఉండగా... శాంకరీదేవి శ్రీలంకలోని ట్రింకోమలిలో ఉంది. కామాక్షి (కంచి), శృంఖల (కోల్‌కతా), చాముండేశ్వరి (మైసూరు), జోగులాంబ (అలంపూర్), భ్రమరాంబ (శ్రీశైలం), మహాలక్ష్మి (కొల్హాపూర్), ఏకవీర (మాహుర్), మహాకాళి (ఉజ్జయిని), పురుహూతిక (పిఠాపురం), గిరిజ (జాజ్‌పూర్), మాణిక్యాంబ (ద్రాక్షారామం), కామరూపిక (కామాఖ్య), మాధవేశ్వరి (ప్రయాగ), వైష్ణవీదేవి (జమ్మూ), మంగళగౌరి (గయ), విశాలాక్షి (కాశి), సరస్వతీ దేవి (శ్రీనగర్) రూపాలను ఆనంద నిలయంలో దర్శించుకోవచ్చు. ఇదే ప్రాంగణంలో లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శివపార్వతులతో కూడిన 22 దేవాలయాలను నిర్మించడం విశేషం.

### ఆధ్యాత్మిక శోభ... సామాజిక సేవ...

కరీంనగర్‌కు వెళ్లే రాజీవ్ రహదారికి ఆనుకుని కొండపాక గ్రామ శివారులో ఆనంద నిలయం ఆవరణలో ఈ క్షేత్రం ఉంది. శక్తిపీఠాల ఆలయానికి కుడిపైపున శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం కొలువైంది. అమ్మవారి మందిరానికి ఎదురుగా అరుదైన గోవులతో ఓ గోశాల

నూ నిర్వహిస్తున్నారు. ఇది పిరమిడ్ ఆకృతిలో ఉండటం విశేషం. మరోపక్క ఆనంద్ నిషాంత్ బాలసదన్ చారిట బుల్ ట్రస్టు, ఆనంద నిలయం వృద్ధాశ్రమం ఉండటంతో ఆ ప్రాంతం భక్తులు, సామాజిక సేవకుల సందర్శనలతో సందడిగా ఉంటుంది. గోశాల ప్రాంగణంలో శ్రీరాధాకృష్ణసమేత గోమాత మందిరం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. సమీపంలోనే సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్సల దవాఖాన నిర్మాణం జరుగుతున్నది. అంతేకాకుండా సత్యసాయి ట్రస్టు నిర్వహణలో పేద బాలికలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో నిర్మించిన జూనియర్ కళాశాల నడుస్తుండటం ఇక్కడి ప్రత్యేకత.




### నిజంగా ఆనంద నిలయమే...

విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.వి.రమణాచారి నేతృత్వంలో పదమూడు సంవత్సరాలుగా ఆనంద నిలయం ఆశ్రమం నడుస్తున్నది. ఎంతోమంది అభాగ్యులకు ఆశ్రయం కలిపిస్తున్న ఈ ప్రాంగణంలో అష్టాదశ శక్తి పీఠాలను నెలకొల్పితే బాగుంటుందని సిద్దిపేటకు చెందిన 82 ఏండ్ల వృద్ధుడు గట్టు రామరాజేశం ఆలోచించారు. ఆయన సంకల్పం గురించి తెలుసుకున్న రమణాచారి ఆనంద నిలయంలో ఐదు ఎకరాల స్థలం ఇచ్చారు. వెంటనే ఆలయం నిర్మాణానికి స్వయంగా ఒక కోటి యాభైలక్షల రూపాయలను రామరాజేశం అందజేసి ఈ మహత్తర కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అలా ఆయన ఆలోచన, ఆశయం, సత్కర్మ అభిలాష వల్ల ఆలయం పూర్తయ్యింది. ఆనంద నిలయం సభ్యులతో ఈ విషయాన్ని చర్చించగా వారు కూడా స్పందించి దాతల సహకారంతో 10 కోట్ల రూపాయలను సమకూర్చారు. ఈ ఆలయాన్ని ఇటీవలే శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ఆలయ నిర్మాణం కోసం ఆనంద నిలయం సభ్యులతో చర్చించి ఓ కమిటీ ఏర్పాటు చేశారు. 23 మంది ఫౌండర్ ట్రస్టీ సభ్యుల కృషి, సహకారంతో అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవార్ల ప్రతిష్ఠ పూర్తయ్యింది. ''దేశ విదేశాలలో పద్దెనిమిది స్థలాల్లో కొలువుదీరి ఉన్న అమ్మవారి రూపాలను ఒకేచోట నెలకొల్పడం అంటే... అది అమ్మవారి అనుగ్రహం, శంకరుడి కృపగా భావిస్తున్నాం. ఆనంద నిలయం ప్రాంగణంలో 22 దేవాలయాలను నిర్మాణానికి
సహకరించిన వారికి శతకోటి వందనాలు'' అంటున్నారు కేవీ రమణాచారి. భవిష్యత్తులో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా వర్ధిల్లుతుందనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు ఆయన.

...✍ కేసాని నరసింహారావు